
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం | 6 ఆగస్టు 2026
పేజీలు : 08






**రంగారెడ్డి, ఆగస్టు 5 (జనంసాక్షి) :**
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారికి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని తెలిపారు. అసంపూర్ణంగా, తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అవసరమైన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. పేరు, ఇంటి చిరునామా, వయస్సు, లింగం, కుటుంబ వివరాలు లేదా ఇతర సమాచారంలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గడువులోపు సరిదిద్దించుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, బూత్ లెవల్ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.
జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని సూచించారు.

# ఫీల్డ్‌లోకి వర్షాకాల సన్నాహకాల్లో అధికారులు

- ఉప్పల్‌లో డీ-సిల్టింగ్ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన
- కాల్వలు, డ్రైనేజీల్లో పూడిక తొలగింపుపై సమీక్ష
- నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



**ఉప్పల్, ఆగస్టు 5 (జనంసాక్షి):** వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద ముప్పు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉప్పల్ పరిధిలో కొనసాగుతున్న డీ-సిల్టింగ్ పనులను అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన కాల్వలు, అంతర్గత డ్రైనేజీల్లో చేపడుతున్న పూడిక తొలగింపు పనుల పురోగతిని సమీక్షిస్తూ, నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
ప్రధాన కాల్వలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంతో పాటు తొలగించిన పూడికను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
డీ-సిల్టింగ్ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు లోపలి పేజీలో


లోపలి పేజీలో

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ

- ప్రపంచ స్తన్యపాన వారోత్సవాల్లో అవగాహన చార్ట్ ప్రదర్శన
- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థినుల ప్రత్యేక కార్యక్రమం
- తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించిన వైద్యులు, సిబ్బంది

# ఘనంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

యాలాల్ మండలమంతా పండుగ వాతావరణం ప్రజాభిమానానికి నిలువెత్తు నిదర్శనం


లోపలి పేజీలో



# కొడికున్నిల్ సురేష్‌తో బీఎస్ఆర్ భేటీ

## పార్టీ బలోపేతం, తెలంగాణ అభివృద్ధి అంశాలపై చర్చ

**తాండూరు, ఆగస్టు 5 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఆర్‌బీఓఎల్ సీఈఓ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బీఎస్ఆర్) న్యూఢిల్లీలో లోక్‌సభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ చీఫ్ విప్ కొడికున్నిల్ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను ఉత్తేజపరచడం, తెలంగాణలో అమలవుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి అందాల్సిన సహకారం వంటి అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు.
అదే విధంగా దేశంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. భేటీ అనంతరం బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొడికున్నిల్ సురేష్ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ సమావేశం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# పాదచారుల భద్రతకు తొలి ప్రాధాన్యం..

- ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలి: జాయింట్ సీపీ సున్ ప్రీత్ సింగ్
- ఐకియా జంక్షన్, ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ టర్న్ ప్రాంతాల పరిశీలన
- జీబ్రా క్రాసింగ్‌ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- అక్రమ క్యాబ్ పార్కింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశం
- ట్రాఫిక్ ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సమన్వయంతో రద్దీ నియంత్రణ


లోపలి పేజీలో


లోపలి పేజీలో

# మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలి

- 'బద్లావ్ జరూరీ హై' ప్రచారానికి సీపీఐ పిలుపు
- ఆగస్టు 6-16 వరకు దేశవ్యాప్తంగా ప్రచార పాదయాత్రలు
- సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహణ



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ ఏ. సీతయ్య

**రాజేంద్రనగర్, ఆగస్టు4(జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను అనుసరిస్తూ సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు, లింకులు పంపుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ. సీతయ్య సూచించారు. మంగళవారం చింతల్‌మెట్ ఎక్స్ రోడ్డులోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులకు ఓటీపీ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, లోన్ యాప్ వేధింపులు, ఏపీకే ఫైల్స్, పెట్టుబడుల మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఆధార్, పాన్‌కార్డు దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయరాజ్, సైబర్ వారియర్, పీవీ1 సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం



**అంబర్పేట్ ఆగస్టు 6( జనం సాక్షి) :** అంబర్పేట్ పోలీస్ పరిధిలోని తులసీ నగర్లో భవన నిర్మాణ ప్రమాదంలో కార్మికుని దుర్మరణం. పోలీసులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం షకీల్ ఖాన్ (21) ఆకాష్ నగర్ వృత్తి భవన నిర్మాణ కార్మికుడు. వృత్తిలో భాగంగా భవన నిర్మాణ సమయంలో గ్రైండింగ్ మిషన్ జారీ అతడి తలపై పడింది తీవ్ర గాయాలయ్యాయి, వెంటనే గాంధీ హాస్పిటల్ కి తరలించిన ప్రయోజనం దక్కలేదు. అప్పటికే మరణించినట్లు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. నిర్మాణ రంగంలో పనిచేసే వారు తప్పనిసరిగా రక్షణ టూల్స్ ను ఉపయోగించాలని, తగు జాగ్రత్తతో పనిపై ఏకాగ్రతతో చేయాలని అంబర్పేట్ ఎస్ హెచ్ ఓ కిరణ్ కుమార్ సూచించారు.

# అభివృద్ధి పనులు, పెన్షన్లపై డీసీకి వినతి



**అల్వాల్,ఆగస్ట్ 5(జనంసాక్షి):** వెంకటాపురం డివిజన్ కానాజిగూడ భూదేవినగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు పెండింగ్‌లో ఉన్న సామాజిక భద్రతా పెన్షన్లను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ మోసిన్ కోరారు. ఈ మేరకు అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ సంక్షేమం పథకాలు అర్హులకు అందేల కృషి చేయాలి

### జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వారాల సిరాజుద్దీన్



**మోమిన్ పేట ఆగస్టు 5,( జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వారాల సిరాజుద్దీన్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ధారాసింగ్ ఆదేశాల మేరకు పరిగి టౌన్, పరిగి మండల పార్టీ అధ్యక్షులతో కలిసి బుధవారం పరిగి నియోజకవర్గ కేంద్రంలో కలిసి కాంగ్రెస్ పార్టీ గ్రామ మండల కమిటీల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి బాబా ఖాన్, పరిగి టౌన్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పరిగి మండల అధ్యక్షులు వెంకట రాములు, మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు

# మోమిన్‌పేట నంది వాగు ప్రాజెక్ట్ దశ మారనుందా?

### త్వరలో ప్రాజెక్టుకు మహర్దశ




**మోమిన్‌పేట, ఆగస్టు 5 (జనంసాక్షి)**

మోమిన్ పేట మండలంలోని నంది వాగు ప్రాజెక్ట్ దశ మారనుందా. గత నెల 9వ తేదీన సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ బృందం ఢిల్లీ నుంచి వచ్చి నంది వాగు ప్రాజెక్టును పరిశీలించి ,దాని మరమ్మతుల గురించి తగు సూచనలు సలహాలు చేశారు, నంది వాగు ప్రాజెక్టు ద్వారా 2.650 ఎకరాల భూమి సాగు చేసుకునేందుకు,1970 సంవత్సరంలో నిర్మించారు కానీ కుడి ఎడమ కాలువలు మరియు వాటి డిస్ట్రిబ్యూటరీస్ సుమారుగా 25 కిలోమీటర్లు వేరు పూ డుకు పోయి సాగు విస్తీర్ణం 600 ఎకరాలకు పడిపోయింది ,వందల ఎకరాలు బీళ్లు గా వదిలేశారు, గత ప్రభుత్వం దేనిని పట్టించుకొ లేదు ,కానీ ఇప్పుడున్న ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, చొరవతో నంది వాగు ప్రాజెక్ట్ ను పూర్తిగా పునరుద్ధరించేందుకు, వాటితో పాటు గణేష్ ఘా ట్, బతుకమ్మ మెట్లు, మినీ ట్యాంక్ బండ్ నిర్మించేందుకు, ప్రతిపాదనాలు సిద్ధం చేస్తున్నారు సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ



ఆర్గనైజేషన్ బృందం ,సూచనల మేరకు, అలాగే నంది వాగు ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల రైతుల సూచనలు, సలహాలు స్వీకరించి సర్వే చేసి ప్రతిపాదనాలు సిద్ధం చేస్తున్నారు, ప్రాజెక్టులోని ప్రధాన కాలువలు తూములు చెరువు కట్ట అలుగు కింది భాగాలు మరమ్మతులు అవసరమైన ప్రాంతాలను ఇంజనీర్స్ పరిశీలించారు, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని మరమత్ పనులు చేపడతామన్నారు, ప్రాజెక్ట్ పరిస్థితిని అంచన వేసిన విషయం తెలిసింది, పరిపాలన అనుమతులు టెండర్ ప్రక్రియ పూర్తిచేసే మరమతు పనులు ప్రారంభం కానున్నాయి, నంది వాగు ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరిగి సాగునీటి సరఫరా మెరుగుపడి ఆయకట్టు రైతులకు విశేష ప్రయోజనం చేకూరుతుంది అంటున్నారు, త్వరలో నంది వాగు ప్రాజెక్ట్ రూపురేఖలు మారుతున్నాయి, అన్నారు త్వరలో పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు, ఇరిగేషన్ ఏఈఈ రవితేజ,ను వివరణ కోరగా త్వరలో మరమతుల మరమ్మతులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు,

# ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం

### హబ్సిగూడలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మిక పర్యటన

### బీరప్పగడ్డలో రూ.25 లక్షల మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**ఉప్పల్, ఆగస్టు 5 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ బుధవారం హబ్సిగూడ డివిజన్‌లోని స్ట్రీట్ నెం. 8లో విస్తృతంగా పర్యటించిన ఆయన, అనంతరం బీరప్పగడ్డ డివిజన్‌లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రధాన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నెం. 8లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని రహదారుల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు నిత్యావసర మౌలిక వసతులు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఎమ్మెల్యే, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని శ్రీ సాయిరాం నగర్ కాలనీ, ధర్మపురి కాలనీ, శ్రీనగర్ కాలనీలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రధాన మంచినీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ పైప్‌లైన్ నిర్మాణంతో ఆయా కాలనీల ప్రజలకు తాగునీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజల సమస్యలను కార్యాలయాల్లో కూర్చొని తెలుసుకోవడం కంటే నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి పరిస్థితులను పరిశీలించడం ద్వారా వేగంగా పరిష్కారాలు అందించగలమని ఆయన అన్నారు.

ప్రజల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక అవసరాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను గుర్తిస్తూ సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకత్వం వల్లే కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, డీజీఎం సుప్రియ, మేనేజర్ కిష్టయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, శ్రీ సాయిరాం నగర్, ధర్మపురి, శ్రీనగర్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్

**చేవెళ్ల, ఆగస్టు 5 (జనంసాక్షి)** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా.తరుణ్ జోషి బుధవారం సాయంత్రం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ భవనం, పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, అధికారిక రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి, నూతనంగా ఏర్పాటు చేసిన పురుషుల బారక్‌ను ప్రారంభించారు. ప్రతి పోలీస్ అధికారి విధుల్లో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, చట్టాలపై, సైబర్ నేరాల నివారణపై, రోడ్డు భద్రతపై నిరంతర ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన కేసులు, యాబ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ సిసిటీఎన్ఎస్, ఈ సక్షేయ అప్లికేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని, సైబర్ నేరాల నివారణ, గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ యోగేష్ గౌతమ్, చేవెళ్ల జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.కిషన్, చేవెళ్ల పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.నరేందర్ రెడ్డి, ఎస్ఐలు కోటేశ్వరావు, తేజస్విని, శిరీష, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ స్వతంత్ర తెలంగాణే లక్ష్యం

## ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**తాండూరు అగస్టు 5జనంసాక్షి**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం జరుపుకునే సైబర్ జాగ్రోక్తా దీవాస్ సందర్భంగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సురక్షా కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ కార్యక్రమం వికారాబాద్ జిల్లా తాండూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా తాండూర్ చౌరస్తా నుండి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు భారీ సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని "సైబర్ మోసాలను తిప్పికొడదాం,ఓటిపి ఎవరికీ చెప్పొద్దు అంటూ నినాదాలు చేశారు. ఎస్పీ స్వయంగా ర్యాలీలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఉద్దేశించి ఎస్పీ ప్రసంగించారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కొత్త రూపాల్లో వస్తున్నాయని, డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వచ్చే మోసాలను నమ్మవద్దు.ఓటిపి, బ్యాంక్ ఖాతా వివరాలు, ఎటిఎం పిన్, సివివి, యుపిఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పంచుకోవద్దు.సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాల పట్ల జాగ్రత్తగా



ఉండాలి. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలి లేదా నెషనల్ సైబర్ క్రైం లో ఫిర్యాదు చేయాలి.విద్యార్థులు సైబర్ భద్రత గురించి తెలుసుకొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పాలి. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా మారితేనే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ లక్ష్యాన్ని సాధించగలం అని ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు.ఛైర్మన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇప్పుడు ప్రతి కుటుంబాన్ని ప్రభావితం చేస్తున్నాయని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య,సిఐ పరమేశ్వర్,రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ ఎస్ఐలు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లు, పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు

## అమ్మ పోచమ్మ తల్లి చల్లగా చూడమ్మా అంటూ భక్తుల మొక్కులు

**బొంరాస్ పేట, ఆగస్టు 5 (జనం సాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ, బొంరాస్ పేట,నాందార్ పూర్, చౌదర్పల్లి తదితర గ్రామాలలో ప్రతి ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించే పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి.తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా గ్రామాలలో సైతం బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.ఉదయం నుండి మహిళలు పిండి వంటకాలు తయారు చేసి, బోనం ముస్తాబు చేసి సాయంత్రం దప్పు చప్పు మధ్య గ్రామ





వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు నిర్వహించి, నైవేద్యాలు, కోడిపుంజులతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మ పోచమ్మ తల్లి మమ్ముల చల్లగా చూడమ్మా పాడిపంటలు బాగా పండి వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. శివసత్తులు పూనకంతో ఊగిపోయారు. ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన వడ్డే అంజమ్మ ప్రతి ఏటా అమ్మవారి బోనం ఇంటి నుండి బయలుదేరినప్పటి నుండి భక్తి పరవశంతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శనలు నిర్వహించే వరకు పూనకంతో ఊగిపోయి భక్తిని చాటుకుంటుంది.ఆయా గ్రామాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో సర్పంచులు బందెయ్య,వీరేశలింగం,లక్ష్మి, ఆయా గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నడుస్తున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

**శంకర్ పల్లి, ఆగస్టు 5 (జనం సాక్షి)**నడుస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సుమారు 35 నుంచి



45 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి నాగులపల్లి,శంకర్పల్లి రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నెం. 149/18–20 వద్ద రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ విషయాన్ని గమనించిన ట్రాక్‌మెన్ సురేష్ వెంటనే శంకర్పల్లి రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు.స్టేషన్ మాస్టర్ వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు.పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు.

# తల్లిపాలు అమృతంతో సమానం

## ప్రతి శిశువుకు తప్పనిసరిగా అందించాలి



**చేవెళ్ల, ఆగస్టు 05 (జనంసాక్షి)** తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని, బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని కౌకుంట్ల గ్రామ అంగన్‌వాడీ టీచర్లు రేణుక, లక్ష్మి తెలిపారు. బుధవారం చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని పేర్కొన్నారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బదలావ్ జరూరి హై ప్రచార యాత్ర వాల్ పోస్టర్ ల ఆవిష్కరణ



**నిజాంపేట్ ఆగస్టు 5 (జనం సాక్షి)**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన (బదలావ్ జరూరి హై)మార్పు కావాలి వాల్ పోస్టర్లు బుధవారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిండెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజా, రైతు, విద్యార్థి, కార్మిక వెతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఆగస్టు 06 నుండి 14 వ తేదీ వరకు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. భారత దేశం అభివృద్ధి చెందాలంటే మార్పు కావాలని (బదలావ్ జరూరి హై ) అని వారు అన్నారు. ఇటీవల పేపర్ లీ కేజీలు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలు, నూతన రైతు వెతిరేక చట్టాలు, నిరుద్యోగ యువత పెరగడం వల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. అని వారు గుర్తు చేశారు. ఈ ప్రచార యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నాకంటి దస్తగిరి, రాము, పుష్పమ్మ, సత్తమ్మ, లక్ష్మి, కవిత, రవి, పద్మ, నర్సమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# "భావన దయా బెస్ట్ రైస్" ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**నిజాంపేట్ జూలై 5 ( జనం సాక్షి):**ప్రజాజీవనంలో నిత్యం మధుమేహం తో అనేకమంది వ్యాధి బాదినపడి అనారోగ్యంతో సతమతమవుతున్న పరిస్థితులు మనకు అందరికీ తెలిసిందే.మధుమేహం తగ్గింపు తో పాటు సంపూర్ణ ఆరోగ్యాభివృద్ధి ఈ భావన దయాబెటిస్ ద్వారా సాధ్యమవుతుందని నిర్వాహకులు తెలియజేస్తున్నారని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ తెలిపారు.125 - గాజులరామారం డివిజన్ మల్లారెడ్డి నగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన భావన దయా బెస్ట్ రైస్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో మధుమేహం బారిన పడిన వారికి మధుమేహం నియంత్రణలో ఈ దయా బెస్ట్ రైస్ ఎంతగానో ఉపయోగప డుతుందన్నారు.ఈ కార్యక్రమంలో భావన దయ బెస్ట్ రైస్ చైర్మన్ సుధీర్, నిర్వాహకులు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, పాక్స్ చైర్మన్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, శశిధర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన




**మల్కాజిగిరి ఆగస్టు 5 (జనంసాక్షి)** ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువత నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏసిపి యాదగిరి రెడ్డి సూచించారు.'సైబర్ జాగృతి దివస్'లో భాగంగా బుధవారం నేరేడ్‌మెట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,డిజిటల్ అరెస్ట్ మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలపై ప్రత్యేకంగా వివరించారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, ఓటిపి, క్యూ ఆర్ కోడ్ మోసాలు, సోషల్ మీడియా మార్ఫింగ్, ఫిషింగ్ నేరాల నుండి ఎలా రక్షణ పొందాలో వివరించారు. మీపాస్‌వర్డ్‌లు మరియు బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. తెలియని లింక్‌లు, యాప్‌లను క్లిక్ చేయ వద్దని తెలిపారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదాషఎఎవతీఏతీఱఎవ.న్రశీజ.ఱఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. సకాలంలో స్పందించడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ వెంకటయ్య, ఎస్ఐ సాయి అవినాష్, కాంతయ్య స్వాతి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బందితో పాటు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని సైబర్ నిబంధనలు పాటిస్తామని హామీ ఇచ్చారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు



**ధారూర్ఆగస్టు 05(జనంసాక్షి)** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గొల్ల రవీందర్ తండ్రి గోరయ్యకు చెందిన నివాసం కూలిపోయింది.విషయం తెలుసుకున్న సర్పంచ్ ఉలేందర్,ఉపసర్పంచ్ కంది ప్రవీణ్ కుమార్,బీఆర్ఎస్ నాయకుడు పోచయ్య బుధవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రవీందర్‌కు తల్లిదండ్రులు ఎవరూ లేరని, కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరారు.అదేవిధంగా సంబంధిత అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ పరిస్థితిని పరిశీలించి,తక్షణ సహాయంతో పాటు అవసరమైన పునరావాస చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళలు విద్యావంతులైతేనే సమాజభివృద్ధి

### అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి

**శంకర్ పల్లి, ఆగస్టు 5 (జనం సాక్షి)**సమాజంలోని ప్రతి ఒక్కరికీ విద్యను చేరువ చేసి, నిరక్షరాస్యత నిర్మూలనతో పాటు జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఉల్లాస్ వయోజన పథకం కింద పాఠశాలకు వెళ్ళని, చదువు మధ్యలో ఆపేసిన కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకంపై శంకర్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.పురపాలక సంఘం పరిధిలోని రేవతి హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,15 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న నిరక్షరాస్యులకు అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం,డిజిటల్ అవగాహన,ఆర్థిక విజ్ఞానం, ముఖ్యమైన జీవన నైపుణ్యాలను అందించేందుకు ఉల్లాస్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యతో పాటు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా,ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఉపాధి,స్వయం ఉపాధి



పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మహిళా సంఘాలకు అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయ అవకాశాలను ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై సదస్సులో సమగ్రంగా అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని, సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. వెంకట నారాయణ, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏ. యోగేష్,మేనేజర్ వి. అంజన్ కుమార్, మెప్మా టీఎంసీ జి. వినోద్ కుమార్,మెప్మా ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గర్భిణులకు అండగా 'శ్రీమంత కానుక

**పెద్దేముల్ ఆగస్టు05(జనం సాక్షి)** గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషణకు అండగా నిలవాలనే లక్ష్యంతో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు పెద్దేముల్ తండాలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. 'విజయక్క మాతృశక్తి' పేరుతో 42 మంది గర్భిణులకు 'శ్రీమంత కానుక' కిట్లను ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ స్థానిక సర్పంచ్ డి.వై. నర్సింలు, ఉప సర్పంచ్ డి.వై. ప్రసాద్ లతో కలిసి స్వయంగా ఇంటింటికీ వెళ్లి అందజేశారు. గర్భిణుల ఆరోగ్యం, పౌష్టికాహారం, మాతృత్వ సంరక్షణకు తోడ్పడే ఉద్దేశంతో అవసరమైన పౌష్టికాహార పదార్థాలు, మంగళకర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ డి.వై. నర్సింలు, ఉప సర్పంచ్ డి.వై. ప్రసాద్ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా గర్భిణుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుందని సర్పంచ్ నర్సింలు అన్నారు. స్థానిక



మహిళలు, గ్రామ ప్రజలు కూడా ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు అక్బర్ బాబా, అనిల్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రేణుక, ఎర్రలక్ష్మి, కమలాబాయి, ఆశా వర్కర్లు అనూష, మల్లీశ్వరి, పుష్పతో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేబీఐఈటీ, బీఈసీలో ఓరియంటేషన్ డే

**మొయినాబాద్, ఆగస్టు05, జనంసాక్షి:**జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జేబీఐఈటీ), భాస్కర్ ఇంజినీరింగ్ కాలేజ్ (బీఈసీ) సంయుక్తంగా 2026--27 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం బుధవారం ఓరియంటేషన్ డే--2026 కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఎంఎన్ఆర్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అకడమిక్ విధానం, క్యాంపస్ వాతావరణం, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ జనరల్ యు. రాజా బాబు ముఖ్య అతిథిగా, హైదరాబాద్ హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి హెచ్.జీ. పరమానంద దాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. జేబీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జె.వి. కృష్ణారావు విద్యార్థులను స్వాగతిస్తూ సంస్థల విద్యా ప్రమాణాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, సమగ్ర అభివృద్ధికి అందిస్తున్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా యు. రాజా బాబు మాట్లాడుతూ, దేశాభివృద్ధి, జాతీయ భద్రతకు ఇంజినీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలతో తోడ్పడాలని సూచించారు. హెచ్.జీ. పరమానంద దాస్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు,



నిజాయితీ, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ నిబంధనలు, పరీక్షల విధానం, ప్లేస్‌మెంట్ అవకాశాలు, స్టార్టప్‌లు, వ్యవస్థాపకతపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. జేబీఐఈటీ ప్రిన్సిపాల్ డా. పి.సి. కృష్ణమాచారి, బీఈసీ ప్రిన్సిపాల్ డా. సుమంగ పట్నాయక్, జేబీఈఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చి. సంజయ్, క్యాంపస్ అడ్మినిస్ట్రేటర్ కల్నల్ ఎం.ఏ. దుబే తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

**మొయినాబాద్,ఆగస్టు05, జనంసాక్షి:**మొయినాబాద్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో చిన్నారులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకోగా.. పోతురాజుల నృత్యాలు భక్తులను అలరించాయి. డప్పు చప్పుళ్ల మేళతాళాల మధ్య గ్రామస్తులు భక్తులను స్వాగతించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,



యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

# సైబర్ నేరాలపై ప్రజలే తొలి రక్షణ కవచం

**ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు ప్రత్యేక అవగాహన కార్యక్రమం**
**నిర్వహించిన ఉప్పల్ పోలీస్ స్టేషన్ అధికారి కాశీ విశ్వనాథ్**
**డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన**
**వ్యక్తిగత, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించొద్దని హెచ్చరిక**




**ఉప్పల్, ఆగస్టు 5 (జనం సాక్షి):** సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉప్పల్ పోలీసులు మరోసారి వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రతిరోజూ ఉదయం నడకకు వచ్చే వాకర్స్‌ను ఉద్దేశించి ఉప్పల్ పోలీస్ స్టేషన్ అధికారి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలు చేస్తున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే సైబర్ మోసాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా పోలీసులు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్‌కు సైబర్ నేరస్థులు ప్రస్తుతం అనుసరిస్తున్న మోసాల పద్ధతులను వివరంగా తెలియజేశారు. గుర్తు తెలియని ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, బ్యాంకు ఖాతాల అప్‌డేట్ పేరుతో వచ్చే కాల్స్, కేవైసీ నవీకరణ పేరుతో పంపే లింకులు, పెట్టుబడుల పేరుతో వచ్చే ప్రకటనలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లు వంటి వాటి ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్లు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు, సీవీవీ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయకూడదని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కాల్ వచ్చినా తొందరపడి స్పందించకుండా ముందుగా నిజానిజాలు తెలుసుకోవాలని, మోసపోయినట్లు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నియంత్రణలో అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, పోలీసులు ఎంత చర్యలు తీసుకున్నా ప్రజల సహకారం లేకుండా సైబర్ మోసాలను పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదని ఉప్పల్ పోలీస్ స్టేషన్ అధికారి కాశీ విశ్వనాథ్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, యువత డిజిటల్ లావాదేవీల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ఉప్పల్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలకు గణనీయంగా అడ్డుకట్ట వేయవచ్చని, అనుమానాస్పద ఘటనలు ఎదురైన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు గజ్జెల సత్యరాజ్ గౌడ్, కొత్తగట్టు శ్రీనివాస్ చారి, నాగేష్ గౌడ్, పాండు, కొండయ్య, జంగా రెడ్డి, శ్యాం, హనుమంతు, వెంకటేశ్వరరావు, రాజు, దినేష్‌తో పాటు ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణకు సంబంధించిన సూచనలను ఆసక్తిగా విన్న వాకర్స్, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల ప్రజల్లో మరింత చైతన్యం పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# 3 గంటల్లోనే 8 నెలల చిన్నారిని క్షేమంగా రక్షించిన మేడిపల్లి పోలీసులు

**బోడుప్పల్-జనంసాక్షి**





మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అపహరణకు గురైన ఎనిమిది నెలల చిన్నారిని పోలీసులు కేవలం మూడు గంటల్లోనే క్షేమంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. అత్యంత వేగంగా స్పందించి కేసును ఛేదించిన మేడిపల్లి పోలీసులను ఉప్పల్ డీసీపీ కె. సుమతి ఐపీఎస్ అభినందించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోడుప్పల్, ఏఎన్ఆర్ కాలనీకి చెందిన కోటే శివరాం (35), శ్రావ్య దంపతులకు ఎనిమిది నెలల వయస్సు గల వైష్ణవ్ రుద్రాంశ్ అనే కుమారుడు ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో చిన్నారిని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని మహిళపై బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 137(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల సమాచారాన్ని సేకరించి నిందితురాలి కదలికలను గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టి మూడు గంటల్లోనే చిన్నారిని క్షేమంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. దర్యాప్తులో నిందితురాలిగా నాగోలు ప్రాంతానికి చెందిన భవాని (32)ని గుర్తించారు. ఆమె వ్యక్తిగత కారణాలతో ఈ ఘటనకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్లూస్ టీమ్, సీసీటీవీ విశ్లేషణ బృందం సమన్వయంతో పనిచేసి చిన్నారిని సురక్షితంగా రక్షించడం సాధ్యమైందని డీసీపీ తెలిపారు. వేగంగా స్పందించి కేసును విజయవంతంగా ఛేదించిన దర్యాప్తు బృందాన్ని ఉప్పల్ డీసీపీ కె. సుమతి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## న్యూ పద్మా నగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలించిన శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ఆగస్టు 5 (జనం సాక్షి) :** చంపాపేట్ డివిజన్ న్యూ పద్మా నగర్ కాలనీలో భారీ వర్షాలతో ఇండ్లలోకి చేరిన వరద నీటిని పరిశీలించిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వెంటనే అధికారులతో మాట్లాడి బాక్స్ డ్రెయిన్లలోని పూడిక, చెత్త, నిర్మాణ సామగ్రిని తొలగించి నీటి ప్రవాహం సాఫీగా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, కృష్ణమాచారి, గండికోట శ్రీనాథ్, సదానంద్ రెడ్డి, రవి ముదిరాజ్, ఉమామహేశ్వర్, శివ, జగదీష్, సురేందర్ రెడ్డి, వసంత, వసంత్, రాజశేఖర్ రెడ్డి, అల్లంపల్లి శ్రీనివాస్, జయవర్ధన్ రెడ్డి, విజయనంద్ రెడ్డి, శ్రీను యాదవ్, శ్రీనుపంతులు, యాదయ్య, సుధాకర్ రెడ్డి, నరహరి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాయదుర్గం గౌడ సంఘం భవనం ప్రారంభోత్సవం

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మధుయాష్కి గౌడ్, పాశం అశోక్ గౌడ్**



**రాయదుర్గం, ఆగస్టు 5 (జనం సాక్షి) :** రాయదుర్గం గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌తో పాటు హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు, సంఘం ప్రతినిధులు స్మరించుకున్నారు. గౌడ సంఘం భవనం నిర్మాణం ద్వారా రాయదుర్గం ప్రాంతంలోని గౌడ సామాజిక వర్గానికి మరింత ఉపయోగకరమైన వేదిక అందుబాటులోకి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. సంఘ కార్యక్రమాలు, సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్‌ను గౌడ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సంఘం నూతన భవనం ప్రారంభోత్సవం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఘనంగా కురుమల బోనాలు



**రాజేంద్రనగర్,ఆగస్టు5(జనంసాక్షి) :** సికింద్రాబాద్ లష్కర్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో కురుమల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భోలక్‌పూర్ బీరప్ప గుడి నుంచి మల్లన్నగుడి, బన్సీలాల్‌పేట్, సుభాష్‌రోడ్, కురుమ బస్తీ, పెద్దమ్మ గుడి తదితర ప్రాంతాల నుంచి కురుమలు జై మహంకాళి నామస్మరణతో భారీగా తరలివచ్చారు. వందల ఏళ్లుగా మహంకాళి, బీరప్ప, మల్లన్నలను కులదైవాలుగా కొలుస్తూ బోనాలు సమర్పించడం తమ సంప్రదాయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య, బీజేపీ సీనియర్ నాయకులు చీర సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు సోనాలి సునీల్ కురుమ, మధారం కృష్ణ, కొల్లంపల్లి శ్రీనివాస్, వెంకటేష్, మాజీ కౌన్సిలర్ నటరాజ్, కొంగల పాండు, వన్నడి రమేష్, సునీల్, జాత్రామ్ శ్రీను, ఉప్పల్ శ్రీను, వేణుగోపాల్, రిషి, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కురుమ కులస్థులు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు నిండు ప్రాణం బలి



**రాజేంద్రనగర్,ఆగస్టు5(జనంసాక్షి) :** అతివేగంతో కారు నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన ప్రకారం బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యూ హఫీజ్‌పేట్‌కు చెందిన సోడా ప్రవీణ్ (33) మృతి చెందారు. మైహోమ్ అవతార్ జంక్షన్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్రవీణ్‌ను మారుతి ఎర్టిగా కారు నెంటిజి05 టిపి0389 ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఘటనపై నర్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఘట్‌కేసర్,మేడిపల్లి స్కూల్ గేమ్స్ జోనల్ సెక్రటరీగా విద్యాసాగర్

**బోడుప్పల్-జనంసాక్షి :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో బోడుప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.పి.ఎం.విద్యాసాగర్‌ను ఘట్‌కేసర్, మేడిపల్లి జోన్ల స్కూల్ గేమ్స్ జోనల్ సెక్రటరీగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పాఠశాల క్రీడల నిర్వహణ,సమన్వయం, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం,క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం వంటి బాధ్యతలను విద్యాసాగర్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా విద్యాశాఖ అధికారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.క్రీడల అభివృద్ధికి, విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యాసాగర్ నియామకంపై ఘట్‌కేసర్, మేడిపల్లి జోన్ల వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు చెంగిచర్ల డిపోలో కార్గో పార్సిళ్ల బహిరంగ వేలం

**బోడుప్పల్-జనంసాక్షి :** ఆర్టీసీ చెంగిచర్ల డిపోలో జూలై-2025 నుంచి మే-2026 వరకు వినియోగదారులు తీసుకెళ్లకుండా మిగిలిపోయిన కార్గో పార్సిళ్లను ఆగస్టు 6న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు డిపో మేనేజర్ ఎస్. స్వాతి తెలిపారు. సంబంధిత వినియోగదారులకు పలుమార్లు ఫోన్ ద్వారా సమాచారం అందించినప్పటికీ వారు పార్సిళ్లను స్వీకరించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.వేలం ఆగస్టు 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెంగిచర్ల డిపో గేటు ఆవరణలో నిర్వహించబడుతుంది. పార్సిళ్లను వాటి షిప్‌మెంట్ విలువలో 30 శాతం ప్రారంభ ధరతో వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో మొత్తం 38 పార్సిళ్లు అందుబాటులో ఉంటాయి. వీటిలో ఆటోమొబైల్ స్పేర్స్--6, క్లాత్--1, ఎలక్ట్రికల్స్--4, జనరల్ వస్తువులు--18, ఎలక్ట్రానిక్స్--9 ఉన్నాయి.తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా కార్గో, పార్సిల్ సేవలను అందిస్తున్న చెంగిచర్ల డిపో ఈ వేలంలో ఆసక్తి ఉన్న ప్రజలు, వ్యాపారులు పాల్గొని పార్సిళ్లను పొందవచ్చని డిపో మేనేజర్ ఎస్. స్వాతి కోరారు.

## నేటి నుండి ఎరువుల పంపిణీకి కొత్తగా ఎఫ్.ఎఫ్.ఎస్.యాప్ ద్వారానే



**మర్పల్లి ఆగస్టు 05 (జనంసాక్షి)** నేటి నుండి భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల విక్రయ విధానంలో మార్పులు అమల్లోకి వస్తాయని ఏవో శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఇకపై యూరియా, డీఏపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎంఓపీ తదితర అన్ని ఎరువుల ఎఫ్. ఎఫ్. ఎస్. యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి. నేటి నుండి పాత యూరియా యాప్ వాడకం పూర్తిగా నిలిచిపోతుందని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇకపై ఈ నూతన యాప్ ద్వారానే ద్వారానే బుక్ చేసుకోవాలి. ఈ విధంగా ఎరువులు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు ఇప్పటివరకు ఐడి లేని రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి సంప్రదిస్తే వెంటనే వివరాలు నమోదు చేసుకోవచ్చని అన్నారు. అలాగే రైతులు భూమి పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు అనుసంధానమైన మొబైల్ సంఖ్య ఆధారంగా ఓటీపీ ధ్రువీకరణ పూర్తి చేయవలసి ఉంటుందని తెలిపారు. రైతుల భూమి విస్తీర్ణం సాగు చేసే పంటల ఆధారంగా వారికి అవసరమైన ఎరువుల కోటను ముందస్తుగానే వ్యవస్థలో నమోదు చేస్తారని విక్రయ ప్రక్రియ గురించి వివరిస్తూ ఎరువుల కొనుగోలు సమయంలో డీలర్ యాప్ లో క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ జారీ అవుతుందని రైతు మొబైల్ నెంబర్కు వచ్చే ఓటీపీ ధృవీకరణ పూర్తయిన తర్వాతనే ఎరువుల పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్న మీ గ్రామానికి సంబంధించిన రైతు వేదికల్లో ఏఈఓ ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# ప్రభుత్వ అవసరాల భూ సర్వేలో తప్పులు ఒప్పుకోం

**రీ-సర్వేకు డిప్యూటీ కలెక్టర్ ఆదేశం** మొండి గౌరెల్లి రైతులతో ఆర్‌డీఓ కార్యాలయంలో ఉన్నతాధికారుల సమావేశం



**యాచారం, ఆగస్టు 5 (జనం సాక్షి ):** ప్రభుత్వ అవసరాల నిమిత్తం సేకరిస్తున్న భూముల సర్వేలో దొర్లిన తప్పులను తక్షణమే సరిదిద్దాలని, రికార్డులతో పాటు సాగులో ఉన్న కబ్జా భూములకు కూడా పూర్తి పరిహారం అందించాలని యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి కోలన్ రమాదేవి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం గ్రామ పంచాయతీ వద్ద ప్రదర్శించిన సర్వే నెంబర్ 127కు సంబంధించిన వివరాలలో అనేక తప్పులుండటంతో, గతంలో తహసీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డీఓ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, బుధవారం ఆర్‌డీఓ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సర్పంచ్ రమాదేవి మల్లారెడ్డి తన పాలకవర్గం, వివిధ పార్టీల నాయకులు మరియు రైతులతో కలిసి హాజరయ్యారు. భూబాధితుల సమస్యలను విన్న డిప్యూటీ కలెక్టర్ చంద్ర రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. వివాదాస్పదంగా మారిన 127 సర్వే నెంబర్ భూమిని వెంటనే క్షేత్రస్థాయిలో 'రీ-సర్వే' చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తయిన తర్వాత మరోమారు గ్రామస్తులతో సమావేశమై తదుపరి నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రికార్డు పరంగా ఉన్న భూమితో పాటు, రైతుల కబ్జాలో ఉన్న భూమికి కూడా ప్రభుత్వం పూర్తి పరిహారం చెల్లించాలంటూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం తహసీల్దార్ అయ్యప్ప, ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షులుగా యు. రమేష్ నియామకం



**తాండూరు, అగస్టు 5(జనంసాక్షి)** భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీకి కొత్త అధ్యక్షుడిగా యు. రమేష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ నేతలు బుధవారం ప్రకటించారు.సంస్థాగతంగా బలమైన నేతగా పేరున్న యు. రమేష్ గత కొంతకాలంగా పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి అనుభవం సంపాదించారు. యువకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తారనే ఉద్దేశంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర నాయకత్వం తెలిపింది. నియామకం అనంతరం మాట్లాడిన యు. రమేష్, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లడమే మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక నేతలు, కార్యకర్తలు రమేష్ కు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.




## యాలాల మండలంలో ఎమ్మెల్యే జన్మదిన ఫ్లెక్సీలపై వివాదం

**మండల అధ్యక్షుడి ఫోటో మిస్ కావడంతో కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి**

**యాలాల ఆగస్టు 5 (జనంసాక్షి ) :** యాలాల ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యాలాల మండలంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా సెంటర్లలో, కూడళ్లలో వేసిన ఈ ఫ్లెక్సీలు ప్రస్తుతం కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి.ఎమ్మెల్యే ఫోటోతో పాటు సీనియర్ నేతల చిత్రాలను ఫ్లెక్సీలపై ముద్రించినా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్ ఫోటోను మాత్రం తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని ఫ్లెక్సీలలో ఆయన ఫోటోను మార్చి వేరే నేతల చిత్రాలు వేశారని కార్యకర్తలు అంటున్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర మనస్తాపం నెలకొంది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మండల అధ్యక్షుడి ఫోటోను కావాలి అనే పక్కన పెట్టారని పలువురు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన మండల అధ్యక్షుడు మహిపాల్, పార్టీ కోసం అందరం కలిసి పనిచేస్తున్నాం. జన్మదిన వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడిగా నా ఫోటో వేయకపోవడం బాధ కలిగించినా పార్టీ విషయంలో నేను అందరిని కలుపుకోని పోవడానికి ప్రయత్నం చేస్తున్నానని అయినా ఇది వారి వారి వ్యక్తిగత అభిప్రాయంగా భావించినా ! ఇలాంటి చిన్న చిన్న విషయాలకు అవకాశం కల్పించి ప్రతిపక్ష పార్టీల దృష్టిలో ఏలాంటి చర్చకు ఆస్కారం ఇవ్వకూడదనేదే తన ఉద్దేశం అన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా అనే అనుమానాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీల విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై పార్టీ అధిష్టానం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు. లేకుంటే మండలంలో ఇది పార్టీలో చీలికలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పంటల సాగులో 10 శాతం వృద్ధి

**రాజేంద్రనగర్,ఆగస్టు5(జనం సాక్షి)**

తెలంగాణలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. జూలై 29 నాటికి సాధారణ పంటల విస్తీర్ణం 98.13 లక్షల ఎకరాలు కాగా, 33 లక్షల ఎకరాల్లో (34 శాతం) పంటలు విత్తినట్లు వెల్లడించారు.యాదాద్రి భువనగిరి (57%), మేడ్చల్-మల్కాజ్‌గిరి (54%), జనగామ (51%) జిల్లాలు ముందంజలో ఉండగా, ఖమ్మం (16.5%), వనపర్తి (17.3%), వరంగల్ (20.1%) జిల్లాలు చివరి స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా కొనసాగుతుండగా, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు కూడా పెరిగిందని పేర్కొన్నారు.

## జుట్టు సంరక్షణ ఎంతో అవసరం

**ఖైరతాబాద్, ఆగస్ట్ 05 (జనం సాక్షి) :** వర్షాకాలంలో తేమ, చెమట, వర్షంలో తడవడం వల్ల జుట్టు పొంగిపోవడం,చుండ్రు, దురద వంటి సమస్యలు పెరుగుతాయని సౌందర్య చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.డైసన్ ఇంజినీర్ , ప్రిన్సిపల్ హెయిర్ సైంటిస్ట్ రాబ్ స్మిత్ తోకలసి ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జుట్టుకు తల చర్మం(స్కాల్ప్) ఆరోగ్యమే పునాది అని అన్నారు. తల చర్మాన్ని క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచ డం, తడి జుట్టుతో నిద్రపోకపోవడం, పూర్తిగా ఆరి న తర్వాతే కట్టుకోవడం వంటి అలవాట్లు అవసర ని అన్నారు. గాలిలో తేమ వల్ల జుట్టు స్వభావం మారి హెయిర్ స్టైల్ ఎక్కువసేపు నిలవదని తెలి పారు. అధిక వేడి వినియోగించకుండా జుట్టును సరిగా ఆరబెట్టడం, డైసన్ బ్యూటీ ఉత్పత్తుల్లోని ఇంటెలిజెంట్ హీట్ కంట్రోల్, హై-స్పీడ్ ఎయిర్‌ఫ్లో సాంకేతికతలు ఆరోగ్యకరమైన జుట్టు సంరక్షణకు తోడ్పడతాయని చెప్పారు. సరైన జుట్టు సంరక్షణ అలవాట్లను పాటించాలని సూచించారు.



## రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 5 (జనం సాక్షి):** హబ్సిగూడ సీట్ నెం.1లోని శ్రీ మహంకాళి మరియు శ్రీ రామ్ మందిర్‌లో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కృపా కటాక్షాలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, ప్రశాంతమైన జీవనం సాగించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బాబురావు, ధర్మకర్తలు విపిన్ అగర్వాల్, రఘు సింగమనేని, మల్లాది రమాకాంత్ రెడ్డి, అమర వాణి మేక, పెద్దోళ్ల విజయలక్ష్మి, రామేశ్వరం ధర్మరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విజయ్ కుమార్, జావిద్, మల్లు నాయక్, రామారావు, సాయి, సుమన్ నాయక్, వాసు నాయక్, జూనియర్ గణేష్ నాయక్ పాల్గొన్నారు.

## టిజిఐసి ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఇండ్ల పట్టాల పంపిణీ

**కొడంగల్ ,ఆగస్టు05 (జనం సాక్షి):** టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన లగచెర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాలను కొడంగల్ నియోజకవర్గం బసి రెడ్డి ఫంక్షన్ హాలు నందు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధితో పాటు భూములు కోల్పోయిన రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇండ్ల స్థలాల పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇండ్ల స్థలాల పట్టాలు పొందిన రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన పునరావాస, పునర్నిర్మాణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన కొడంగల్ నియోజకవర్గంలోని లగచెర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఇండ్ల స్థలాల కేటాయింపునకు డ్రా నిర్వహించారు.



గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:

- హకీంపేట్ (అసైన్డ్ భూములు): 175 మంది లబ్ధిదారులకు 17 సార్లు డ్రా నిర్వహించారు.
- హకీంపేట్ (పట్టా భూములు): 113 మంది లబ్ధిదారులకు 16 సార్లు డ్రా నిర్వహించారు.
- లగచెర్ల (అసైన్డ్ భూములు): 54 మంది లబ్ధిదారులకు 7 సార్లు డ్రా నిర్వహించారు.
- లగచెర్ల (పట్టా భూములు): 173 మంది లబ్ధిదారులకు 31 సార్లు డ్రా నిర్వహించారు.
- పోలెపల్లి (అసైన్డ్ భూములు): 38 మంది లబ్ధిదారులకు 6 సార్లు డ్రా నిర్వహించారు. మొత్తంగా 432 మంది లబ్ధిదారులకు డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా, 121 మంది లబ్ధిదారులకు నేరుగా (డైరెక్ట్ అలాట్‌మెంట్) ద్వారా ఇండ్ల స్థలాలు కేటాయించబడ్డాయన్నారు.మొత్తం 553 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయగా, ఇందుకోసం మొత్తం 77 సార్లు డ్రా నిర్వహించారు.

భూములు కోల్పోయిన రైతుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శక విధానంలో ఇండ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లగ చెర్ల, హకీంపేట్, పోలె పల్లి, రోటి బండ తండా రైతుల సహకారం తో 553 పట్టాల పంపిణీ కార్యక్రమం పారదర్శ కంగా నిర్వహించడం జరిగిందన్నారు. అందరి సహకారం తో 230 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడుకేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇండస్ట్రియల్ పార్క్ వస్తుందని, 501 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్డు ఏర్పాటు కు మీ అందరిసహకారమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి స్నేహ మెహార,ప్రజా ప్రతి నిధి తిరుపతి రెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు ఎస్ పి రాజేష్ మీనా, ఆర్ డి ఓ అనిత, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంపయ్య గౌడ్,హకీంపేట్, లగ చెర్ల, పోలె పల్లి సర్పంచ్ లు, రవీంద్ర, చంద్రయ్య, వెంకట్రాములు గౌడ్,కృష్ణం రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## కమలా నగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమం

**కాప్రా , ఆగస్టు 5: (జనం సాక్షి ) :** కమలా నగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ ఉపాధ్యక్షులు పార్థసారథి చేతుల మీదుగా పలువురు కాలనీవాసులు అసోసియేషన్ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. సంఘం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సహకరిస్తూ ప్రతి కుటుంబం సభ్యత్వం తీసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అలాగే కాలనీ సమస్యలను స్థానికులు ఎప్పటికప్పుడు కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని కాలనీ అధ్యక్ష కార్యదర్శులు జి దశరథ్,నవీన్ చౌదరి తెలిపారు. కాలనీ సమస్యల పరిష్కారం ధ్యేయంగా తమ కమిటీ



ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీవాసులు మద్దిరాల చంద్రశేఖర్, రాజేశ్వర్,కిషోర్ తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గోపగాని గురువయ్య గౌడ్

**శామీర్ పేట, ఆగస్టు 5 ( జనం సాక్షి ) :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇన్స్పెక్టర్ గోపగాని గురువయ్య గౌడ్ సూచించారు. శామీర్ పేట మండలం అలియా బాద్ మున్సిపల్ జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్ దక్ష జూనియర్ కాలేజీలో ఇన్స్పెక్టర్ గోపగాని గురువయ్య గౌడ్ ఆధ్వర్యంలో సైబర్ జాగ్రుక్త కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలి, ఆన్‌లైన్ మోసాలను ఎలా గుర్తించాలి, సోషల్ మీడియాను సురక్షితంగా ఎలా వినియోగించాలి, బ్యాంకింగ్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటీపీ, సీవీవీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్ వంటి గోప్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని వివరించారు. అదేవిధంగా, తెలియని లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి పథకాలు, లోన్ యాప్‌లు, క్యూఆర్ కోడ్ మోసాలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌ల ప్రమాదాలు, సోషల్ మీడియా ప్రైవసీ, ఫేక్ న్యూస్, సైబర్ బుల్లియింగ్, సిమ్ స్వాప్ మోసాలు, ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లు వంటి అంశా లపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని, అలాగే డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సైబర్ క్రైమ్.గౌవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండడం, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. జినోమ్ వ్యాలీ పోలీసులు ప్రజలలో సైబర్ నేరాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సురక్షిత డిజిటల్ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## కేరళకు చెందిన వ్యక్తి అదృశ్యం



**శంకర్ పల్లి, ఆగస్టు 5 (జనం సాక్షి) :** కేరళకు చెందిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మోకిల తండాలో కలకలంరేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ కుమార్ స్వస్థలం కేరళ రాష్ట్రం. పని నిమిత్తం గత ఆదివారం మోకిల్లతండాకు వచ్చి కొండకల్ లోని అపర్ణ కంపెనీలో వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడు. అతను తన గ్రామస్తుడైన హేమంత్ కుమార్ గదిలోనే మోకిల్లతండాలో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో హేమంత్ కుమార్ రేషన్ తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి అనిల్ కుమార్ గదిలో కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హేమంత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే మోకిల పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



## బహిరంగంగా మద్యం సేవించిన ముగ్గురిపై పోలీసుల చర్య

### జరిమానాతో పాటు మూడు రోజుల సామాజిక సేవ విధించిన న్యాయస్థానం

**ఘట్‌కేసర్, ఆగస్టు 5 ( జనం సాక్షి ) :** ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని, ఎల్‌బీ నగర్ గౌరవ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం వారికి జరిమానా విధించడంతో పాటు, మూడు రోజుల పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని ఘట్‌కేసర్ పోలీసులు హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, ఇటువంటి సంఘటనలు ఎక్కడైనా గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## పెద్దేముల్‌లో ఘనంగా తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**పెద్దేముల్, ఆగస్టు 05 (జనంసాక్షి):** తాండూర్ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి, జన్మదిన వేడుకలను పెద్దేముల్ మండలంలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి, మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ..ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తాండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మనోహర్ రెడ్డి గెలిచిన తర్వాత పెద్దేముల్ మండలానికి అధిక నిధులు ఇచ్చి మండల అభివృద్ధిలో తోడ్పాటును ఇచ్చాడని తెలిపారు, దాంతోపాటు కోట్ పల్లి, ప్రాజెక్ట్ కెనాల్ కు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు వేగంగా కొనసాగుతున్నా యని తెలిపారు. ఎమ్మెల్యే ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే నాయకుడని ప్రశంసించారు. అలాగే తాండూర్ నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు,విద్య, వైద్య రంగాల్లో ఆయన చేస్తున్న కృషి మరువలేనిదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా మనోహర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు .మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుమిత్ రాథోడ్, సెక్రెటరీ అశోక్, మహిళ ఉపాధ్యక్షురాలు సునీత వెంకట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నల్ల ఎల్లారెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎండి రియాజ్, నసీరుద్దీన్,డివై నర్సింలు,ప్రకాశం,బుజ్జమ్మ,వెంకటయ్య, నర్సింలు,మైఫుజ్ ,పీటర్ యాదయ్య, సర్పంచులు వెంకట్ అరుణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు

### ఓటు హక్కు కరపత్రాల కార్యక్రమం పేరుతో

# ప్రచారాలు చేసుకుంటున్న నాయకులు

### ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు

### పభుత్వ కార్యాలయాలలో కుప్పలు

### తిప్పలుగా నిలిచిపోయిన ఫిర్యాదులు

**నాచారం (జనంసాక్షి) :** ఎన్నికలు రాకముందే ఉప్పల్ నియోజకవర్గం లోని నాచారంలో ఓట్ల పండుగ వచ్చినట్టే అనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా, ఓటరు కరపత్రాలను ప్రజలకు అందజేసి వారి వివరాలను నింపించి, ఓటర్ కార్డులో తప్పిదాలు ఉంటే వాటిని సరిదిద్దుకునే ప్రక్రియలో భాగంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని అన్ని పార్టీల నాయకులు దొరికిందే అవకాశం అని భావించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నా రు. నాచారం డివిజన్ హెచ్ఎంటి డివిజన్ మల్లాపూర్ మీర్పేట్ వాళ్లు డివిజన్లో కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ బిజెపి పార్టీ నాయకులు తమ సొంత తెలివితేటలతో ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు.

నాచారం హెచ్ఎంటి డివిజన్లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి కాలనీలలో ఉన్న కమ్యూనిటీ హాల్స్ లో మరియు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సెంటర్ల వద్ద మూడు పార్టీల నాయకులు మూడు దిక్కులుగా ఏర్పడి గుడారాలను టెంట్లను టేబుల్ లను ఏర్పాటు చేసుకొని వాటితో పాటు తమకు సంబంధించిన పార్టీ ఫ్లెక్సీలను వారి ఫోటోలతో బ్యానర్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకొని ఉత్తరకం ప్రచారానికి తెర తీశారు. అంతేకాకుండా వారి యొక్క ఫ్లెక్సీలను ప్రైవేటు ఆటోలకు అమర్చి సౌండ్ స్పీకర్ల ద్వారా ఎస్ఐఆర్ పట్ల అవగాహన కల్పిస్తున్నట్టుగా పూర్తి సమాచారాన్ని వారే వినిపిస్తున్నట్టుగా మైకుల ద్వారా ఇంటింటి ప్రచారం కూడా చేపడుతున్నారు. ఎస్ ఐ ఆర్




ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన ఆదేశాలు అధికారులే పట్టించుకోవడం లేదు. ఇంటింటికి వెళ్లి ఎస్ ఐ ఆర్ పత్రాలను ఇవ్వాలి ఓటర్లకు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన వాటిని పట్టించుకోకుండా ఇప్పటివరకు కూడా బిఎల్ఓలో నిర్లక్ష్యం వహించి ఇంటింటికి ఇచ్చి వచ్చినటువంటి సంఘటనలు వందలో 40 శాతం వరకే ఉన్నట్టుగా సర్వేలలో తేటతెల్లమైంది. పలుచోట్ల ఓటర్ల యొక్క అడ్రస్లు గల్లంతవల్ల




మరియు ఓటర్లు చనిపోయి ఉండటం వల్ల వారి యొక్క వివరాల సేకరణలో భాగంగా ఇబ్బందులు గురికావడంతో సమస్యలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరిగినా కూడా అధికారులు పదేపదే చెబుతున్నా కూడా చింత చచ్చిన పులుపు చావదు అన్నట్టుగా మరోపక్క బిజెపి పార్టీ కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ లకు సంబంధించిన నాయకులు ఇదే అదునుగా భావించి విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల వారి యొక్క ప్రచార వాహనాల వల్ల తీవ్ర సమస్యలు అనగా సౌండ్ పొల్యూషన్ తో విపరీతంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మరియు కొన్నిచోట్ల ప్రధాన కోడళ్లలో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ప్రయాణించలేని పరిస్థితి వల్ల పౌరులు వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాయకులంటే సేవకులుగా ఉండాలే గాని సమస్యలను కొని తెచ్చే విధంగా ఉండకూడదని కాలనీవాసులు మండిపడుతున్నారు.

మూడు రంగుల జెండాలు ఫ్లెక్సీలు : మూడు రంగుల జెండాలతో ఫ్లెక్సీలతో ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లో విచ్చలవిడిగా మూడు పార్టీలకు సంబంధించిన మాజీ కార్పొరేటర్లు ప్రస్తుత ఆశావాహులు టికెట్ కోసం ప్రయత్నిస్తున్న మరి కొంతమంది నాయకులు తమ ఉనికిడిని కాపాడుకోవడానికి తమ యొక్క సత్తాను చూపించుకోవడానికి ప్రచార వాహనాలను వాడుకుంటూ మరో కొత్తదైన శైలిలో ప్రచారం చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.




అంతేకానీ ఇప్పటివరకు నిజంగా ఓటరు జాబితా కి సంబంధించినటువంటి ప్రక్రియలో భాగంగా బిఎల్ఓ ల పనితీరుతో అన్ని శాఖలకు సంబంధించినటువంటి సిబ్బందితో కలిసి ఓటరు కరపత్రాల విషయంలో ఎంతవరకు ప్రక్రియ పూర్తయింది అనేటువంటి అవగాహన కూడా చాలా వరకు నాయకులకు లేదు. కేవలం ఎస్ ఐ ఆర్ ప్రక్రియను చూపించి తమకు తాము ప్రచారం చేసుకుంటున్నారే తప్ప వేరే సమస్యలు తీర్చే విధంగా మాత్రం పనులు పూర్తి కాలేకపోతున్నాయి. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ మొదలైనప్పటినుండి మిగిలిన ఇతర శాఖల విభాగాల అధికారుల సైతం సిబ్బంది సైతం సంబంధిత కార్యాలయాల వద్ద అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని విభాగాలలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది ఒక్క ఎస్సై ఆర్ ఓటరు కరపత్రాల పంపిణీల విషయంలో మాత్రమే పనిచేయడంతో ప్రజలకు ఉన్న సమస్యలు కుప్పలు తిప్పలుగా అన్ని కార్యాలయాల్లో పెరిగిపోయాయి. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా సమస్యలకు నిలయంగా ప్రభుత్వ కార్యాలయాలు దర్శనమిస్తున్నాయి. ఈ తీరు ఎన్నడు మారును సమస్యలు ఎన్నటిదిరునో ఇక వేచి చూడాల్సిందే.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ

- ప్రపంచ స్తన్యపాన వారోత్సవాల్లో అవగాహన చార్ట్ ప్రదర్శన
- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థినుల ప్రత్యేక కార్యక్రమం
- తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించిన వైద్యులు, సిబ్బంది



**ఎల్బీనగర్, ఆగస్టు 5 (జనంసాక్షి):** ప్రపంచ స్తన్యపాన వారోత్సవాల సందర్భంగా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థినులు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చార్ట్ ప్రదర్శన ద్వారా స్తన్యపానం వల్ల శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, తల్లులు పాటించాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు. శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని, తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలను మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి సమృద్ధిగా లభిస్తాయని నర్సింగ్ విద్యార్థినులు వివరించారు. తల్లిపాలలో శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, పలు రకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుంచి శిశువును రక్షించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని చార్టుల ద్వారా అవగాహన కల్పించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి-బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్ పరిశీలించి నర్సింగ్ విద్యార్థినులను అభినందించారు. తల్లిపాల ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. ప్రపంచ స్తన్యపాన వారోత్సవాల ముఖ్య ఉద్దేశం ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన ప్రారంభాన్ని అందించడం, తల్లిపాలపై అవగాహన పెంపొందించడమేనని వైద్యులు తెలిపారు. స్తన్యపానానికి సంబంధించిన సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనప్పుడు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సూచనలు తీసుకోవాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డా. దామోదర్, చర్మవ్యాధుల విభాగాధిపతి డా. రాజీవ్ సింగ్, ఆర్ఎంఓలు, నర్సింగ్ ట్యూటర్లు, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- యాలాల్ మండలమంతా పండుగ వాతావరణం
- ప్రజాభిమానానికి నిలువెత్తు నిదర్శనం



**తాండూరు ఆగస్టు 5 (జనంసాక్షి) :** తాండూరు శాసనసభ్యులు, ప్రజల మనసు గెలుచుకున్న నాయకులు బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం యాలాల్ మండలంలో అపూర్వమైన ఉత్సాహం, అభిమానంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ యాలాల్ మండల అధ్యక్షులు కే. మహిపాల్ సౌజన్యంతో మండలంలోని 39 గ్రామాల్లో ప్రత్యేకంగా తయారు చేసిన కేకులు, ఫ్లెక్సీలతో జన్మదిన వేడుకలు నిర్వహించి మండలమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా గిరిజాపురం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జుంటుపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల అధ్యక్షులు కే. మహిపాల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే తనయుడు శివకుమార్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తల ఆనందాన్ని మరింత రెట్టింపు చేశారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మనోహర్ రెడ్డి పై తమ ప్రేమాభిమానాలను ఘనంగా చాటుకున్నారు. ఈ వేడుకలను విజయవంతం చేయడంలో అహర్నిశలు కృషి చేసిన సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, బీఎల్ఓలు, కార్యకర్తలు, మనోహర్ రెడ్డి అభిమానులు మరియు ప్రతి ఒక్కరికి మండల అధ్యక్షులు కే. మహిపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకుడిపై ప్రజలు చూపించే ప్రేమే ఆయనకు నిజమైన బలం. యాలాల్ మండలంలో కనిపించిన ఈ అభిమానమే మనోహర్ రెడ్డి ప్రజల హృదయాల్లో ఎంత ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారో మరోసారి నిరూపించిందని కే.మహిపాల్ పేర్కొన్నారు.

## ఫీల్డ్‌లోకి వర్షాకాల సన్నాహకాల్లో అధికారులు

తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా అన్ని డీ-సిల్టింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

## మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలి

**కాప్రా, ఆగస్టు 5 (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని, వాటిని ప్రజలంతా ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.ఎస్. బోస్ పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'బద్లావ్ జరూరీ హై' -- చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఉప్పల్ మండల సమితి సమావేశంలో ఆయన విడుదల చేశారు. ఈ సమావేశానికి ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్యప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై.ఎస్. బోస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ధరల పెరుగుదలను అరికట్టడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించడం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడం, ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడం, దళితులు, ఆదివాసులకు సామాజిక న్యాయం అందించడం వంటి ప్రధాన డిమాండ్లతో ఉద్యమాన్ని చేపడుతున్నామని తెలిపారు.
దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు, ప్రజలను చైతన్యపరిచేందుకు ఆగస్టు 6 నుంచి 16 వరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ప్రచార పాదయాత్రలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవస్థలో మార్పు కోసం చేపడుతున్న సీపీఐ ప్రచార కార్యక్ర మాలను విజయవంతం చేయాలని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎదుగుదలలో పోషక ఆహార ప్రాముఖ్యత

**- అమెజాన్, శ్రీ సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో**



**షాబాద్, ఆగస్టు 5 (జనం సాక్షి);** పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అమెజాన్ మరియు శ్రీ సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొమ్మిది వేల కి పైగా విద్యార్థులకు ఉదయ అల్పాహార కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లతో కలిసి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోషకాహారం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. చిన్నారులకు సమతుల్య ఆహారం, పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు వంటి పోషకాహారం ప్రతిరోజు అందేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ మన్నాగర్ ట్రాంగ్ లేవెస్, తాతాజీ, అన్నపూర్ణ ట్రస్ట్ ఆశిష్ భరద్వాజ్, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు శాంతమ్మ, ప్రభాకర్ రెడ్డి, నర్సింలు, సబితా, నవనీతం, పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**ఎల్బీనగర్, ఆగస్టు 5 (జనం సాక్షి):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్స్ పోలీసుల సహకారంతో సంజీవని వనం, వివేకానంద, డీర్ పార్కులతో పాటు కృష్ణవేణి కళాశాల విద్యార్థులకు 'సైబర్ జాగురుకత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్టుబడి మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫోటో మార్ఫింగ్, డేటా హ్యాకింగ్ తదితర సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ కాశిరెడ్డి, సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివశంకర్, ఎస్‌హెచ్‌వో రవిబాబు, ఇన్‌స్పెక్టర్లు కృష్ణంరాజు, నాగచారి, ఎస్ఐలు గిరీష్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పాదచారుల భద్రతకు తొలి ప్రాధాన్యం

- ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలి
- జాయింట్ సీపీ సున్ ప్రీత్ సింగ్
- ఐకియా జంక్షన్, ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ టర్న్ ప్రాంతాల పరిశీలన
- జీబ్రా క్రాసింగ్‌ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- అక్రమ క్యాబ్ పార్కింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశం
- ట్రాఫిక్ ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సమన్వయంతో రద్దీ నియంత్రణ



**శేరిలింగంపల్లి, ఆగస్టు 5 (జనంసాక్షి):**
సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్ ప్రీత్ సింగ్ ఆదేశించారు. బుధవారం మాదాపూర్ ఐటీ కారిడార్‌లోని ఐకియా జంక్షన్ మరియు ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ టర్న్ ప్రాంతాలను ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాదచారుల రాకపోకలు, ట్రాఫిక్ పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.
మెట్రోతో పాటు ఇతర ప్రజా రవాణా సేవలను వినియోగించే పెద్ద సంఖ్యలో పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లను ఉపయోగించకుండా అనధికారిక ప్రదేశాల్లో రహదారులు దాటుతున్నట్లు ఆయన గుర్తించారు. దీంతో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, ప్రజల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రహదారి క్రమశిక్షణను మెరుగుపరిచేందుకు అవసరమైన చోట కఠిన అమలు చర్యలు చేపట్టాలని సూచించిన ఆయన, అన్ని వర్గాల రహదారి వినియోగదారులకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించడం ట్రాఫిక్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. అనంతరం ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ టర్న్‌ను పరిశీలించిన జాయింట్ సీపీ, అక్కడ ట్రాఫిక్ ప్రవాహాన్ని అంచనా వేసి రద్దీ తగ్గించేందుకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.
పరిశీలనలో భాగంగా రహదారి పక్కన అక్రమంగా క్యాబ్‌ల పార్కింగ్ జరుగుతున్న విషయాన్ని గమనించిన ఆయన, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే అన్ని అక్రమ పార్కింగ్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించి ప్రజా రహదారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ సున్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, ట్రాఫిక్ ఇంజినీరింగ్, కఠిన ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రజల్లో అవగాహన అనే మూడు అంశాలు సమన్వయంతో అమలైతేనే రహదారి భద్రత మెరుగుపడుతుందని, పాదచారులతో పాటు అన్ని వర్గాల ప్రయాణికులకు సురక్షితమైన, సమర్థవంతమైన రవాణా వ్యవస్థను అందించగలమని పేర్కొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుని అరెస్ట్... మంగళసూత్రం స్వాధీనం




**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (జనంసాక్షి) :** చైన్ స్నాచింగ్ కేసులో మియాపూర్ పోలీసులు ఓ నిందితుడిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి దొంగిలించిన చైన్ ను స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ పి జయరాం వెల్లడించిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్కాపురం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన షేక్ కాజా హర్షల్(20) ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్ కు విచ్చేసి జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడానికి దొంగతనాన్ని ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో గత కొంతకాలంగా ఇళ్ల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని ఆయుర్వేదిక్ మందులను అమ్మే కొరియర్ బాయ్ గా అవతారమెత్తి పెప్పర్ స్ప్రే ను వారిపై ప్రయోగిస్తూ మెడలోని చైన్లు, మంగళ సూత్రాలను దొంగిలించుకొనిపోవడం వ్యవహారంగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో జులై 31వ తేదీ బి. ఆదినారాయణ అనే వ్యక్తి ఒక గుర్తు తెలియని 20 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఆయుర్వేదిక్ మెడిసిన్ లను కొరియర్ చేస్తున్నానని చెప్పి తన భార్య వద్దకు వచ్చి ఒంటరిగా ఉందని తెలిసిన మరుక్షణం ఆమె మొహంపై స్ప్రేను ఉపయోగించి ఆమె మెడలోని నాలుగు తులాల మంగళ సూత్రాన్ని అపహరించుకొని పారిపోయాడని మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు అందించిన వివరాలతో పాటు సిసి కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విశ్వసనీయ సమాచారంమేరకు నిందితుడు కాజా హర్షలను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనాన్ని అంగీకరించడంతో అతడి వద్ద నుండి నాలుగు తులాల బంగారు మంగళసూత్రం, కొరియర్ కోసం ఉపయోగించిన ఆయుర్వేదిక్ మందుల కిట్ ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రసార మాధ్యమాల ద్వారా ఇలాంటి దొంగతనాల గురించి అవగాహనను పెంచుకోవడం ద్వారా తగిన జాగ్రత్తలను పాటిస్తూ అపరిచిత వ్యక్తులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు వారిని లోపలికి రానీయకూడదని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని మియాపూర్ ఇన్స్పెక్టర్ సూచిస్తున్నారు.



## శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెరెమోనీ నిర్వహణ

### ఘనంగా స్కూల్ క్యాబినెట్ ఎలక్షన్స్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ఇన్వెస్టి టూర్ సెర్మని కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. వాణి ప్రసాద్ పేర్కొన్నారు. పాఠశాలలో గత వారం క్యాబినెట్ ఎలక్షన్స్ నిర్వహించడం జరిగిందని, ఈ ఎలక్షన్స్ లో పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ క్యాప్టెన్, సిసిఎ కెప్టెన్, హౌస్ కెప్టెన్లకు, వైస్ కెప్టెన్లకు ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ వివరించారు. ఈ ఎలక్షన్ లో గెలుపొందిన టువంటి విద్యార్థులకు బ్యాడ్జెస్ తో పాటు మెడల్స్ ను అందించి ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతోపాటు, విద్యార్థులకు ఉపయోగకరమైన టువంటి కోకరికులం పాఠ్యాంశాలతోపాటు ఇతర కార్యక్రమాలను సమాన ప్రాధాన్యతతో బోధిస్తూ వారిలో దాగున్న అంతర్గత నిపుణతను వెలికితీయడంతోపాటు సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు భారత రాజ్యాంగం అవగతం అయ్యేలా ప్రజాస్వామ్య పద్ధతిలో సుహృద్భావ వాతావరణంలో ఎన్నికలను నిర్వహించి నాయకత్వ లక్షణాలను, సామాజిక బాధ్యతను వారిలో పెంపొందించడం జరుగుతుందని వాణి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ ఎలక్షన్స్ వల్ల విద్యార్థులకు ప్రజలు, ప్రత్యక్షంగా రాజకీయ నాయకులను ఏ విధంగా ఎన్నుకుంటారో అనే విషయం అవగతం అవుతుందని అదేవిధంగా విద్యార్థి దశలోనే వారు మంచి నాయకులుగా ఎదగడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇంచార్జ్ హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, అకాడమిక్ డీన్ రాజేశ్, ఇన్చార్జ్ లు సృజన, మాధవి, వ్యాయామ ఉపాధ్యాయులు జోనల్ పిఈటిలు మధు మరియు బాల్ రాజ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీఎంఆర్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ బహూకరణ







**తాండూరు, ఆగస్టు 5 (జనంసాక్షి):** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి (బీఎంఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ వే బెంగళూరు స్వచ్ఛంద సంస్థ రూ.20 లక్షల వ్యయంతో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి అత్యవసర వైద్య సేవల కోసం ఒక నూతన అంబులెన్స్ను అందజేసింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, యునైటెడ్ వే బెంగళూరు ప్రతినిధులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో అంబులెన్స్ను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి పండ్లు పంపిణీ చేశారు. అదే రోజు పట్టణంలోని వైట్ ప్యాలెస్‌లో ఎమ్మెల్యే బీఎంఆర్ జన్మదిన వేడుకలు అభిమానుల సందడి మధ్య ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కుమారులు బుయ్యని శివకుమార్ రెడ్డి, బుయ్యని అవినాష్ రెడ్డి, సోదరుని కుమారుడు బుయ్యని ప్రణయ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ అధికారి

**షాబాద్, (జనం సాక్షి);** షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాధికారితో కలిసి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సందర్శన సందర్భంగా పాఠశాలల లోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిని స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి వారి పఠన, రచన, గణిత నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాలలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, పరిశుభ్రత, హాజరు నమోదు, మౌలిక సదుపాయాలు, పాఠశాల నిర్వహణను పరిశీలించి సంబంధిత అంశాలపై తగిన సూచనలు చేశారు. విద్యార్థులకు సానుకూల విద్య వాతావరణాన్ని కల్పిస్తూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

చేవెళ్ల, ఆగస్టు 05 (జనంసాక్షి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఏకరూప దుస్తులను బుధవారం చేవెళ్ల మండలంలోని పలు పాఠశాలల్లో పంపిణీ చేశారు. ముడిమ్యాల్ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ గౌడిచెర్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోనే జంగా రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. అలాగే కౌకుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ బార్లపల్లి మల్లా రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అనిత, అక్షయ్ కుమార్, మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు వినోద్ కుమార్, మార్ నర్సింహులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో మరింత రాణించాలని వారు ఆకాంక్షించారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి: మోకిల సీఐ శ్రీనివాస్ రెడ్డి

### ఓటీపీలను ఎవరితో పంచుకోవద్దు

శంకర్ పల్లి, ఆగస్టు 5(జనం సాక్షి) సైబర్ నేరాలు,ఆన్లైన్ మోసాలు,సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రాచీన్ గ్లోబల్ స్కూల్లో బుధవారం జాతీయ సైబర్ జాగృక్త దివాస్ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సైబర్ నేరాలు,ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని మరియు ఓటీపీలను ఎవరితో పంచుకోవద్దని సందర్భంగా విద్యార్థులకు సూచించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫ్రాడ్క పులిస్టాప్ అనే నినాదంపై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడంతోపాటు సైబర్ నేరాలపై అవగాహనకు గాను పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్ గౌడ్,సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న : జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (జనంసాక్షి) :** ప్రజల స్వాభిమానం, ధైర్యం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాయదుర్గం గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఏఐసిసి నాయకులు మధుయాష్కి గౌడ్, మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, అశోక్ గౌడ్ తో కలిసి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న అధికారాన్ని అనుభవించడానికి కాదు, ప్రజల హక్కులను కాపాడడానికి పోరాడిన మహానాయకుడని, అన్యాయాన్ని ఎదిరించి, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడి, సమానత్వంకోసం పోరాడిన ఆయన జీవితం ప్రతి తెలంగాణ బిడ్డకు స్ఫూర్తి అని కీర్తించారు. తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చరిత్రను గౌరవించే, మరుగున పడిన మహనీయులకు తగిన గుర్తింపు కల్పించే దిశగా పలు చారిత్రక కార్యక్రమాలు చేపడుతోందని, తెలంగాణ చరిత్రను భావితరాలకు చేరవేయడం, ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, మహనీయుల జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం, వారి పేరును ప్రజల్లో మరింత విస్తృతంగా చాటడం వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోందని, ఇది తెలంగాణ ప్రజలకు నిజంగా దక్కిన గౌరవం అన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజా సంక్షేమాన్ని పాలనలో ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని ముందుకు సాగుతోందని, ఇదే స్ఫూర్తి పాపన్న గౌడ్ పోరాటంలో కూడా కనిపిస్తుందన్నారు. అందుకే ఆయన ఆశయాలు నేటి తెలంగాణ నిర్మాణానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం కేవలం ఒక శిల్పం కాదని, అది ధైర్యానికి ప్రతీక, స్వాభిమానానికి చిరునామా, సామాజిక న్యాయానికి చిహ్నం, భావితరాలు ఈ మహనీయుని చరిత్రను తెలుసుకొని,సమాజం కోసం పనిచేసే నాయకత్వాన్ని అలవర్చుకోవాలని జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను పాటిస్తూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తెలంగాణను మరింత అభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయం వైపు తీసుకెళ్లేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు భరత్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, సురేష్ గౌడ్, చిన్న గౌడ్, వీరేందర్ గౌడ్, రోహిత్ గౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, మల్లికార్జున్ యాదవ్, అనిల్ గౌడ్, ఏకాంత్ గౌడ్, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, అశోక్ యాదవ్, కృష్ణ యాదవ్, వివిధ బిసి సంఘాల నాయకులు, గౌడ్ సంఘం రాష్ట్ర మరియు నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.